క్లుప్తంగా

వెండితాపడం తయారీకి రూ.25వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండితాపడం తయారీకి బుధవారం నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలం, టిస్‌బొల్లవరం గ్రామానికి చెందిన ద్వారం రఘురాంరెడ్డి, ఉమాదేవి దంపతులు రూ.25వేలు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నవాబుపేట(పెనుగంచిప్రోలు): గ్రామంలోని మోడల్ కాలనీ వద్ద టీటీడీ వారి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షల నిధులతో తలపెట్టిన శ్రీదేవిభూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులకు గురువారం ఉదయం 8.17గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పాల్గొంటారని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

రైతులకు వడ్డీమాఫీ నగదు అందజేత

నవాబుపేట(పెనుగంచిప్రోలు): రైతులు స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 2020–21 మధ్య తీసుకున్న పంట రుణాలకు సంబంధించిన వడ్డీమాఫీ నగదును సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి రవికుమార్ బుధవారం రైతులకు అందజేశారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రైతులు పంట రుణాలు తీసుకున్న దానికి రూ.లక్షకు రూ.3వేలు చొప్పున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వడ్డీని మాఫీ చేసినట్లు చెప్పారు. సంఘ పరిధిలోని 400మంది రైతులకు కలిపి సుమారు రూ.11లక్షలు వడ్డీ మాఫీ చేస్తూ, ప్రభుత్వం మంజూరు చేసిన నగదును రైతులకు అందజేస్తున్నామని వివరించారు. సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ



నరసింహారావుపాలెం(వీరులపాడు): నిరుపేదలకు ప్రభుత్వాస్పత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని నరసింహారావుపాలెంలో ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందిన వారికి బుధవారం ఆయన కళ్లజోళ్లను పంపిణీ చేశారు. గ్రామసర్పంచ్ దుర్గాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

7న గ్రూప్–2పై అవగాహన సదస్సు



నందిగామ: యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నందిగామలో ఈనెల 7వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు గ్రూప్–2పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆర్డీవో పి.సాయిబాబు బుధవారం ఆవిష్కరించారు. రైతుపేటలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈసదస్సుకు గ్రూప్–2కు ప్రిపేర య్యేవారు హాజరుకావాలని యూటీఎఫ్ నాయకులు మహేశ్వర వెంకటేశ్వరరావు కోరారు. తహసీల్దార్ నరసింహారావు, టీచర్లు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

పేరకలపాడు(కంచికచర్ల) : మండలంలోని పేరకలపాడులో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం), వీవీప్యాడ్స్ పనితీరుపై ఓటర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ పి.శంకరబాబు మాట్లాడుతూ ఓటువేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వేమవరపు పురుషోత్తం, కందుల అశోక్‌కుమార్, నారాయణ, వీఆర్వోలు కేవీ రామారావు, కె.బ్రహ్మం, ఆపరేటర్, ఓటర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

పెనుగంచిప్రోలు: గ్రామంలోని మూడో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ విభాగం అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీఎంఓ పి.నవీన్ ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, గర్భిణులకు చేస్తున్న వైద్యపరీక్షల వివరాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. డాక్టర్ పి.ఇందిర, గణాంకాధికారి లక్ష్మీజీ, సిబ్బంది పాల్గొన్నారు.

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామలో నూతన పింఛన్ రూ.3వేలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్ అందిస్తూ అవ్వాతాతల ముఖాలలో సంతోషాలు నింపుతున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పెంచిన పింఛన్ నగదు రూ.3వేలను స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహనరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పింఛన్‌ను రూ.3వేలకు పెంచారని వివరించారు. ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను అమలుచేయడమే కాకుండా, అర్హతే ప్రామాణికంగా ప్రజలకు ఈ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం దేశంలోనే మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో పింఛన్ తీసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సిన పనిలేదన్నారు. ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు.

నియోజకవర్గంలో 39,110 లబ్ధిదారులు..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 39,110మంది లబ్ధిదారులకు ప్రతి నెలా పింఛన్ అందిస్తున్నట్లు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. నందిగామ పట్టణంలో 4,486మంది, మండలంలో 4,795 మంది, కంచికచర్ల మండలంలో 10,628మంది, చందర్లపాడు మండలంలో 10,314మంది, వీరులపాడు మండలంలో 8,876మందికి పింఛన్ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల నుంచి మరో 639మందికి నూతనంగా పింఛన్‌లు మంజూరయ్యాయని వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఓర్సు లక్ష్మి, పాకాలపాటి కిరణ్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, సొసైటీ చైర్మన్ పాములపాటి రమేష్, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, షేక్ ఖాలిక్, దాసు, బండారు వెంకట్రావ్, యాకుబ్ అలీ, జాఫర్, నల్లమల్లి మురళి, కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

గనిఆత్కూరు(కంచికచర్ల) : కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావ పేర్కొన్నారు. మండలంలోని గనిఆత్కూరు గ్రామంలో బుధవారం ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. సొసైటీఅధ్యక్షుడు పాటి బండ్ల హరిజగన్నాధరావు, గ్రామ సచివాలయాలల గృహసారధుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాధ్, నాయకులు పాటి బండ్ల చినతిరుపతిరావు, గుదే శ్రీనివాసరావు, వెంపరాల సాంబశివరావు, షేక్ జానీబాషా, ప్రత్తిపాటి కృష్ణమూర్తి, ముప్పాళ్ల సత్యనారాయణ, వేల్పుల రమేష్, మంగలపూడి సన్నీ, మంగలపూడి కోటిబాబు, మార్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

విప్ సామినేని ఉదయభాను



ముండ్లపాడులో సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ సామినేని ఉదయభాను

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. ముండ్లపాడు గ్రామంలో రూ.45లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్, రూ.39.75లక్షలతో నిర్మించిన సొసైటీ భవనాలు, సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ కరోనా విపత్కర సమయంలో కూడా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏరాష్ట్రంలో లేని విధంగా నిరంతరం కొనసాగాయన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు, పోర్టుల నిర్మాణాల పనులు అతివేగంగా సాగుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు గడప వద్దకే వస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన ఎంతో చేరువైందని వివరించారు. గతంలో ఏపని కావాలన్నా అధికారులు చుట్టూ, మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని నేడు గ్రామాల్లోనే ప్రజల అవసరాలు తీరుతున్నాయని గుర్తుచేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం ఇంటి వద్దనే అందిస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో కూడా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులపై టీడీపీ నాయకులు కోర్టుల ద్వారా అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, మరోమారు రాష్ట్రానికి జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, కొత్తగా మంజూరైన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడపాటి లావణ్య, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, కెడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కొమ్మినేని రవిశంకర్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, పూసల కార్పొరేషన్ డైరక్టర్ చేని కుమారి, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కూచి విష్ణు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, కెడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పి దుర్గాప్రసాద్, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, వైద్యాధికారి పి.ఇందిర, పీఆర్ డీఈ కిరణ్, ఏఈ సుందర రామయ్య, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గోళ్ళమూడిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఉదయభాను

గోళ్ళమూడిలో...

నందిగామ: మన రాష్ట్రంలోని వార్డు, గ్రామసచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం నందిగామ మండల పరిధిలోని గోళ్ళమూడిలో రూ.40 లక్షల తో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.30 లక్షలతో నిర్మించిన సహకార సంఘ భవనాన్ని బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సచివాలయాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ప్రజలకు అత్యంత చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగనన్న పాలనలో సహకార సంఘాల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోందని వివరించారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, జెడ్పిటిసి సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు , గ్రామ సర్పంచ్ కె.కృష్ణ , పార్టీ నాయకులు కొల్లూరు ఉమా , దేవినేని రామారావు, నాని, రమేష్ పాల్గొన్నారు.

బాలికా విద్యకు సావిత్రీబాయి పూలే కృషి



పెనుగంచిప్రోలులో నివాళులర్పిస్తున్న నాయకులు



సావిత్రీబాయిపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్.రాఘవేంద్ర, నాయకులు



పెద్దాపురంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి, టీచర్లు, విద్యార్థులు



కంచికచర్లలో నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: అనేక మహిళా విద్యా సంస్థలను స్థాపించి జీవితాంతం మహిళా విద్య, అభివృద్ధి కోసం కృషిచేసిన సావిత్రీబాయి పూలే సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కొనియాడారు. సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం జగ్గయ్యపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విజయవాడ రోడ్‌లోని సావిత్రీబాయి పూలే విగ్రహానికి బీసీ నాయకులతో కలిసి చైర్మన్ రాఘవేంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మొట్టమొదటి బీసీ మహిళా ఉపాధ్యాయురాలిగా బడుగు, బలహీనవర్గాల విద్యా వ్యాప్తికి సావిత్రీబాయి పూలే కృషిచేసిందని ఆమె సేవలను కొనియాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ ఎస్టీ, వాణిజ్య విభాగాల అధ్యక్షులు బద్దూనాయక్, చారుగుండ్ల కొండ, ఆర్యవైశ్య సంఘ నాయకుడు కొత్తా పురుషోత్తం, గుడ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో...

బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని స్థానిక ఉక్కు కళా వేదికలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పుష్పరాజు, ప్రభుదాసు తదితరులు సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు దొండపాటి శామ్యూల్, నియోజకవర్గ అధ్యక్షుడు పవన్‌కార్తీక్, కన్వీనర్లు కెవీ.రత్నం, జుబేర్, నాయకులు రాజశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి సావిత్రిబాయి పూలే కృషి

పెనుగంచిప్రోలు:మహిళా చైన్యానికి సావిత్రిబాయి పూలే విశేషంగా కృషిచేశారని పూసల కార్పోరేషన్ డైరెక్టర్ చేని కుమారి కొనియాడారు. సావిత్రీభాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద బీసీసంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పోరాడిన మహిళా చైతన్యమూర్తి సావిత్రిబాయి పూలే అని వివరించారు. ఆలయ డైరెక్టర్ కొలిపాక రాము, బీసీ సంఘ నాయకులు కల్లూరి శ్రీవాణి, చేని రాంబాబు, ఆదిమూలం నరసింహారావు, నలబోతు వెంకటేశ్వరరావు, ఏలూరు కృష్ణ, ఏలూరు శ్రీనివాసరావు, కొలిపాక వీరాస్వామి, అంగజాల కాశీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి అధ్యక్షతన బుధవారం సావిత్రీభాయీ పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ జహిదా మాట్లాడుతూ కులవ్యవస్థ నిర్మూలన, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా మహిళలకు హక్కుల కోసం సావిత్రీభాయి విశేషంగా కృషిచేశారని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, సాయి, కుందన, వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిల్లకల్లులో...

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక ఎంఆర్సీ భవనంలో సావిత్రీబాయ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో చిట్టిబాబు మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారి అభ్యున్నతికి సావిత్రీబాయి పూలే ఎంతో కృషిచేశారని కొనియాడారు. సావిత్రీబాయి పూలేకు నివాళులర్పించినవారిలో ఉపాధ్యాయ సంఘ నాయకులు నేలవెల్లి రమేష్‌బాబు, రామారావు, ప్రవీణ్‌కుమార్, ఘంటా వెంకటేశ్వర్లు, మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి కార్యాలయ ఏవో రాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

పెద్దాపురం(వీరులపాడు):తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి పూలే అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం ఏహెచ్‌యుపి పాఠశాలలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఆమె పూలలు వేసి ఘన నివాళులర్పించారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉపసర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం వెంకట్రావ్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: తమకు పింఛన్ కింద నెలకు రూ.5వేలు ఇవాల్సని, గుర్తింపుకార్డులు, ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని మండలానికి చెందిన డప్పు కళాకారులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు వారు తహశీల్దార్ సూర్యారావును బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా కార్యదర్శి ఎం.కుటుంబరావు, కళాకారులు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న విప్ ఉదయభాను

నందిగామ: ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కొనియాడారు. జగ్గయ్యపేట నియోజకవర్గం నందిగామ మండల పరిధిలోని గ్రామాల లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుకగా పెంచిన పింఛన్ నగదు రూ.3వేలు పంపిణీని బుధవారం ఆయన గోళ్లమూడిలో ప్రారంభించారు. ఏటిపట్టు గ్రామాల పరిధిలోని పింఛన్ దారులకు ప్రతినెలా పింఛన్ కింద అందజేసే రూ.1.01కోటి విలువగల మెగా చెక్కును ఆవిష్కరించారు. కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, జడ్పిటిసి సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, ఏటి పట్టు గ్రామాల నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



ప్రభుదాసును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట):సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని న్యూహోప్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ప్రభుదాసు పేర్కొన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో దాతల సహకారంతో ఆధునీకరించిన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలోని విద్యా విధానానికి ప్రస్తుత విధానానికి ఎంతో వ్యత్యాసముందని తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో చిట్టిబాబు, టీచర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు దారావత్ వేణు, యుటీఎఫ్, ఎస్టీయు, పీఆర్టీయూ సంఘ నాయకులు పల్లవి, ప్రవీణ్ కుమార్, రమేష్, దుర్గాప్రసాద్, రామారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నందిగామ(చందర్లపాడు): పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు ఆర్డీఓ పి.సాయిబాబు తెలిపారు. చందర్లపాడు, ముప్పాళ్ళ, బొబ్బిళ్ళపాడు, కోనయపాలెం, గుడిమెట్లల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించాల్సిన వసతులపై చర్చించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు కల్పించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసిల్దార్ సుశీల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వత్సవాయి(పెనుగంచిప్రోలు): వత్సవాయి మండల వాసవి క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు ఆధ్వర్యంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా మద్దు మణికుమార్, కార్యదర్శిగా వాగు ప్రభాకర్, ట్రెజరర్‌గా పోలిశెట్టి రమేష్ ను ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని సత్కరించారు. క్లబ్ రీజినల్ చైర్మన్ కర్లపాటి కొండ, రీజినల్ సెక్రటరీ చిన్నం ప్రసాద్, కొత్త పురుషోత్తం, రాయపూడి శ్రీకాంత్, గుర్రం హనుమంతరావు, కోటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

435 మందికి వైద్యపరీక్షలు

జగ్గయ్యపేట అర్బన్: ఎన్నెస్పీ క్వార్టర్స్ వద్దనున్న 13వ సచివాలయ పరిధిలోని ప్రజల కోసం స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని 435మంది ప్రజలకు వైద్యపరీక్షలు చేశారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ముఖ్యఅతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారని వివరించారు. మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రావు, కృష్ణ, గుంజ లక్ష్మణ్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై వెళ్లి.. లంక వాసులను కలసి



లంకవాసులను పలకరించేందుకు కృష్ణానదిలో ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



లంకభూముల రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గనిఆత్కూరు(కంచికచర్ల): కంచికచర్ల మండలం గనిఆత్కూరు, అమరావతి మధ్యన ఉన్న కృష్ణానది లంక భూముల్లో ఉంటున్న ప్రజలను కలిసేందుకు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం కృష్ణానదిలో ట్రాక్టర్‌పై ప్రయాణం చేశారు. ట్రాక్టర్ వెళ్లనిచోటు నుంచి కాలినడకన ఐదు కిలోమీటర్ల మేర నడిచి లంకభూముల్లో ఉంటున్న 14కుటుంబాలవారిని కలసి మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న అరటి, పసుపు, కంద, మినుము పంటలను పరిశీలించారు. పంట నష్టానికి పరిహారాన్ని తప్పకుండా ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే, బాధిత రైతులకు హామీ ఇచ్చారు. నాలుగు దశాబ్దాలుగా లంక భూముల్లో జీవిస్తూ వ్యవసాయం చేసుకుంటున్నామని, ప్రపంచంలో జరిగే విషయాలేవి తమకు తెలియవంటూ లంకవాసులు ఎమ్మెల్యేకు వివరించారు. తమ గోడు పట్టించుకునేందుకు ఇంతవరకు ఎవ్వరూ లంకలోకి రాలేదని వాపోయారు. తమను పలకరించేందుకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు నదిలో కిలోమీటర్ల దూరాన్ని ప్రయాణం చేసి రావడంపై వారు సంతోషం వ్యక్తంచేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట సొసైటీ అధ్యక్షుడు పాటి బండ్ల హరిజగన్నాధరావు, ప్రత్తిపాటి కృష్ణమూర్తి, జాన్‌మియా, గుదే శ్రీనివాసరావు, వి.తిరుపతిరావు, ముప్పాళ్ల సత్యనారాయణ, వీఆర్వో వనిత ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. జిల్లా పరిషత్ వారు ముద్రించిన స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని పదోతరగతి విద్యార్థులకు బుధవారం వారు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎస్ శ్రీనివాసరావు, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోశెట్టి బ్రహ్మం, దేరంగుల శ్రీనివాసరావు, బొమ్మి రాణి పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: మాగల్లు జెడ్పీ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు జెడ్పీ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను కేడీసీసీబీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వివరించారు. బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

